# గురుకులం భద్రమేనా..?

- జామ్ గ్రామంలో ఒకే ఆవరణలో గురుకులం, కస్తూరిబా భవనాలు
- పరిసరాల్లో పెరిగిన పిచ్చిమొక్కలు
- చుట్టూ పడిపోతున్న ప్రహరీ
- భయాందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు



మరుగుదొడ్ల వద్ద పెరిగిన పిచ్చిమొక్కలు



గురుకులం వెనుక వైపు రెండుచోట్ల పడిపోయిన ప్రహరీ

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామంలో ఒకే ఆవరణలో ఉన్న సాంఘీక సంక్షేమశాఖ బాలికల గురుకులం, కస్తూరిబా భవనాల చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో విద్యార్థినులు భయాందోళన చెందుతున్నారు. గురుకులం, కస్తూరిబాల భవనం చుట్టూ పలుచోట్ల ప్రహరీ కూలిపోగా.. మరికొన్నిచోట్ల దెబ్బతింది. దీంతో పశువుల తోపాటు విషసర్పాలు యథేచ్ఛగా లోనికి వచ్చే ప్రమాదం ఉంది. వర్షాకాలం కావడంతో విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రహరీ నిర్మించి.. భవన పరిసరాల్లో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

**ఒకే ఆవరణలో గురుకులం, కస్తూరిబా..**

12ఏళ్ల కిందట జామ్ గ్రామంలో సాంఘీక సంక్షేమ శాఖ బాలికల గురుకులం, తర్వాత మూడేళ్లకు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ఒకే చోట ఏర్పాటు చేశారు. గురుకులంలో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు 640 మంది విద్యార్థినులు చదువుతున్నారు. కస్తూరిబాలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు 412 మంది విద్యనభ్యసిస్తున్నారు. అయితే పాఠశాల భవనం నల్లరేగడి నేలలో నిర్మించడంతో ప్రహరీ మొత్తం కుంగిపోయింది.. ఇప్పటికే సుమారు ఐదు చోట్ల ప్రహరీ కూలిపోయింది. మరికొన్ని చోట్ల నెర్రలుబారి పడిపోయేందుకు సిద్ధంగా ఉంది.

**మైదానంలో వర్షపునీరే..**

గురుకులం ఏర్పాటుకు ఐదెకరాలు కేటాయించగా సుమారు ఎకరంన్నర స్థలాన్ని క్రీడా మైదానంగా మార్చారు. ఇందులోనే గురుకులం, కస్తూరిబా భవనాలు నిర్మించారు. కేవలం పాఠశాల ఎదుట విద్యార్థులు ప్రార్థన చేసేందుకు మాత్రమే కొంత స్థలంలో మొరం పోయించి చదును చేయించారు. మిగతా ప్రదేశంలో వర్షపునీరు నిలిచి దోమలువ్యాప్తి చెందుతున్నాయి. ఈనీటిని బయటకు తరలించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో విద్యార్థినులకు ఇబ్బందులు తప్పడం లేదు.

**పాఠశాలలోకి చొరబడిన ఆగంతకుడు..**

రెండేళ్ల కిందట ఓ ఆగంతకుడు గురుకులంలోకి ప్రవేశించి సీసీ కెమెరాలకు చిక్కకుండా వసతిగృహంలో చొరబడి నానా బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం పాఠశాల రక్షణగోడ కూలిపోయింది. దీంతో ఎక్కడినుంచైనా సునాయసంగా లోనికి ప్రవేశించే వీలుండటంతో విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గురుకుల పాఠశాల భవనం వెనుకవైపు, వంటగది వైపు ఏపుగా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి చిట్టడవిని తలపిస్తున్నాయి. తమ పిల్లలు చక్కగా చదువుకుంటారని గురుకులానికి పంపితే ఇక్కడి పరిస్థితులు మమ్మల్ని ఆందోళనకు గురి చేస్తున్నాయని పలువురు విద్యార్థినుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇళ్లకు తీసుకెళ్లలేక, పాఠశాలలో ఉంచలేక అయోమయానికి గురవుతున్నారు. అధికారులు స్పందించి చుట్టూ ప్రహరీ నిర్మించడంతోపాటు పిచ్చిమొక్కలను తొలగించాలని కోరుతున్నారు. మరోవైపు సీసీకెమెరాల సంఖ్యను పెంచాలని వేడుకుంటున్నారు.



వసతిగృహం వెనుక వైపు పరిసరాలు

# ప్రజల రక్షణ కోసమే కార్డన్‌సెర్చ్

- పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్

నిర్మల్‌టౌన్: ప్రజల రక్షణ కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం(కార్డన్‌సెర్చ్) నిర్వహిస్తున్నామని పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. డీఎస్పీ గంగారెడ్డి పర్యవేక్షణలో జిల్లా కేంద్రంలోని సోఫినగర్‌లో బుధవారం తెల్లవారుజామున కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈసందర్భంగా సరైన ధ్రువపత్రాల్లేని 50 ద్విచక్రవాహనాలు, నాలుగు ఆటోలను సీజ్ చేశారు. పట్టణ సీఐ మాట్లాడుతూ కాలనీలో కొత్త వ్యక్తులు, అనుమానితులు కన్పిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. యువత గంజాయి, మద్యం, డ్రగ్స్‌కు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. కాలనీలో ఏవైనా సమస్యలుంటే 100కు డయల్ చేసి చెప్పాలన్నారు. నేరాల నియంత్రణకు కాలనీలో సీసీ కెమెరాలను అమర్చుకోవాలని సూచించారు. ఎస్సైలు రవీందర్, అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

# న్యాస్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ

ఖానాపూర్: మండలంలోని పాతఎల్లాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో బుధవారం ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాల్లోని సాంఘికశాస్త్రం ఉపాధ్యాయులకు న్యాస్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దేశవ్యాప్తంగా జాతీయ సాధన సర్వే పరీక్ష (న్యాస్)ను ఎన్‌సీఈఆర్‌టీ నిర్వహిస్తోంది. నవంబర్‌లో నిర్వహించే న్యాస్ పరీక్షకు ఉపాధ్యాయులను సమాయత్తం చేసేందుకు ఇటీవల రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో పాఠశాల విద్యాశాఖ శిక్షణనిచ్చింది. అందులో సబ్జెక్టుల వారీగా శిక్షణ పొందిన రిసోర్స్‌పర్సన్లతో కాంప్లెక్స్ స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా న్యాస్ పరీక్ష నిర్వహణ, ప్రశ్నపత్రం తీరును వివరించారు. అభ్యసన ఫలితాల ఆధారంగా పాఠాలు బోధిస్తే విద్యార్థులు సులువుగా న్యాస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తారని వివరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం రమాదేవి, రిసోర్స్‌పర్సన్ వినోద్ ఉన్నారు.

# ‘ఎమ్మెల్యేపై దుష్ప్రచారం సహించబోం’

ఖైంసాటౌన్: నియోజకవర్గ సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడిన ఎమ్మెల్యే పి.రామారావుపటేల్‌పై దుష్ప్రచారం చేస్తే సహించేది లేదని బీజేపీ పట్టణాధ్యక్షుడు మల్లేశ్వర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎస్ఎస్ కాటన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గత పాలకుల వైఖరితో ముధోల్ నియోజకవర్గంలో సమస్యలు పేరుకుపోయాయని పేర్కొన్నారు. డబుల్‌బెడ్ రూం ఇళ్లు, ఏరియాస్పత్రికి నిధులు, ట్రిపుల్‌ఐటీలో మత్తు పదార్థాల నియంత్రణ తదితర సమస్యలపై ప్రస్తావించారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గౌతం పింగ్లే, భూకిరణ్, రావుల పోశెట్టి, దశరథ్, అనిల్, నారాయణ తదితరులున్నారు.

కుంటాల: ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌పై విపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలు తగవని బీజేపీ సీనియర్ నాయకుడు జీవీ.రమణారావు పేర్కొన్నారు. బుధవారం కుంటాలలో విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడిన మాటలను వక్రీకరించి ప్రచారం చేయడం సరికాదన్నారు. పార్టీలకతీతంగా అభివృద్ధి కోసం అందరూ కలిసి రావాలని కోరారు. సమావేశంలో కల్యాణ్ గజేందర్, తాటి, కాంతారావు, రమేశ్, రాజు పాల్గొన్నారు.



భైంసాలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

# ‘అర్హులందరికీ రుణమాఫీ చేయాలి’

భైంసాటౌన్: అర్హులైన రైతులందరికీ రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేయాలని భైంసా ఏఎంసీ మాజీ చైర్మన్ రాజేశ్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం భైంసాలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రూ.లక్ష లోపు రుణాలు 19 లక్షల మందికి పంపిణీ చేస్తే.. ప్రస్తుత ప్రభుత్వం ఆంక్షల పేరిట 11 లక్షల మందికి మాత్రమే రుణం మాఫీ చేసిందని పేర్కొన్నారు. నిబంధనల పేరిట రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పడం సరికాదన్నారు. రుణమాఫీ కాని రైతుల వద్దకు వెళ్లి వారి సమస్యను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించాలని బీజేపీ కార్యకర్తలకు సూచించారు.

**రైతుల సమస్యలు పరిష్కరించాలి**

కుంటాల: కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ కానీ రైతుల సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎంపీపీ అప్క గజ్జారాం పేర్కొన్నారు. బుధవారం కుంటాలలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన మాట తప్పారన్నారు. ఏడు నెలల వడ్డీ చెల్లిస్తేనే రుణమాఫీ చేస్తామని బ్యాంకర్లు చెబుతుండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సుధాకర్, రైతులు భూలింగు, సోమ సత్తయ్య, తదితరులున్నారు.

# తిర్పెల్లి ప్రాథమిక పాఠశాల పరిశీలన

లక్ష్మణచాంద: మండలంలోని తిర్పెల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని బుధవారం పంచాయతీరాజ్ ఈఈ శంకరయ్య పరిశీలించారు. ఇటీవలి వర్షాలకు భవనంలోని గదులు ఉరుస్తుండటంతోపాటు వరండాలో పైకప్పు పెచ్చులు కిందపడ్డాయి. ఈ విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు మంగళవారం కలెక్టర్ అభిలాష అభినవ్‌ను కలిసి తిర్పెల్లి పాఠశాల సమస్య వివరించారు. స్పందించిన కలెక్టర్ బుధవారం పంచాయతీరాజ్ ఈఈ శంకరయ్యను పాఠశాల సందర్శించి సమస్యలపై నివేదించాలని ఆదేశించారు. మరమ్మతులకు నిధులను అంచనా వేసి ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాజేశ్వర్, బిట్లింగ్ నారాయణ, ఈటెల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న ఈఈ శంకరయ్య

# భావితరాల కోసం మొక్కలు నాటాలి

నిర్మల్‌టౌన్: భావితరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. వనమహోత్సవంలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని నూతన కలెక్టరేట్ సమీపంలో ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద మెగా ప్లాంటేషన్ డే నిర్వహించారు. ఈసందర్భంగా కాలనీవాసులతో కలిసి అధికారులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవిదాస్ తదితరులున్నారు.

తానూరు: వనమహోత్సవంలో భాగంగా గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటించాలని ఈజీఎస్ ఏపీవో గంగాధర్ సూచించారు. బుధవారం మండలంలోని బెంబర నర్సరీలో మొక్కలను పరిశీలించారు. నాటిన మొక్కల వివరాలను తెలుసుకున్నారు. వారి వెంట ఈజీఎస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



నిర్మల్‌లో మొక్క నాటుతున్న చైర్మన్ ఈశ్వర్

**మొక్కలు నాటి సంరక్షించాలి**

భైంసాటౌన్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని మున్సిపల్ మేనేజర్ గౌరీశ్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా పట్టణంలోని భైంసా-నిర్మల్ రహదారి వెంట ఉద్యోగులు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటి ట్రీగార్డులు ఏర్పాటు చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనీస్, సిబ్బంది ఉన్నారు.



భైంసాలో మొక్క నాటుతున్న ఉద్యోగులు

# ‘స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం’

ఖానాపూర్: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీజేపీ శ్రేణులు సమన్వయంతో ముందు సాగాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రితీశ్ రాథోడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని పీఆర్‌టీయూ భవన్‌లో నిర్వహించిన పార్టీ పట్టణ, మండల కార్యవర్గ సమావేశానికి హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా ఎన్నికల్లో గెలిచేందుకు అనుసరించాల్సిన ప్రణాళికల గురించి పార్టీ శ్రేణులతో చర్చించారు. కార్యక్రమంలో అంకం మహేందర్, నాయిని సంతోశ్, టేకు ప్రకాశ్, పుప్పాల ఉపేందర్, నల్లూరి శ్రీధర్, ఆకుల శ్రీనివాస్, గడ్డం రవీందర్, పడాల రాజశేఖర్, బొప్పారపు సత్యవతి, మదిరె శ్రీనివాస్, కొండవేణి రమేశ్, దాసరి శ్రీనివాస్, పెద్దిరమేశ్, గోపాల్‌రెడ్డి, భూమన్న, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.



కడెంలో మాట్లాడుతున్న రితీశ్‌రాథోడ్

**నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటా**

కడెం: పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని బీజేపీ రాష్ట్ర నాయకుడు రితీశ్‌రాథోడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రణాళికతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమావేశం ప్రారంభానికి ముందు మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ మృతికి సంతాపంగా మౌనం పాటించారు. బీజేపీ మండలాధ్యక్షుడు కాశవేణి శ్రీనివాస్, నాయకులు రవీందర్‌గౌడ్, సత్తెన్న, యాతం రాజు, ప్రసాద్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

# నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

ఖానాపూర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం నుంచి తల్లిపాల వారోత్సవాలను నిర్వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత అన్నారు. బుధవారం మండలంలోని సత్తన్‌పల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో పాతఎల్లాపూర్ సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రతి కేంద్రంలో న్యూట్రిగార్డెన్ ఉండేలా చూడాలన్నారు. ప్రతి నెలా చిన్నారుల ఎత్తు, బరువు వివరాలు నమోదు చేసి.. బరువు తక్కువ ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ శ్రీలత

## దరఖాస్తుల స్వీకరణ

కుభీర్: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో బస్‌పాస్‌ల కోసం 15 మంది దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వారికి గురువారం బస్‌పాస్‌లు ఇవ్వనున్నట్లు ఆర్టీసీ అధికారి శ్రీనివాస్ తెలిపారు. దివ్యాంగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పి.పిరాజీ ఉన్నారు.

## రుణమాఫీ చేయాలని వినతి

కుంటాల: అర్హులందరికీ రుణమాఫీ చేయాలని మండలంలోని లింబా (కే) గ్రామ రైతులు బుధవారం కుంటాల రైతువేదికలో ఏవో సోమలింగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కొందరికి మాత్రమే రుణం మాఫీ కావడంతో మిగతా రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. దత్తుపటేల్, ప్రమోద్‌పటేల్, శ్రీనివాస్, వినయ్, ఆరిఫ్ ఉన్నారు.

## మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కుంటాల: మండలంలోని ఓలా గ్రామానికి చెందిన బిలోల వినోద్‌గౌడ్ అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబసభ్యులను బుధవారం మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పరామర్శించారు. మురళిగౌడ్, బుచ్చన్న, రాజన్న, శంకర్, శ్రీనివాస్ ఉన్నారు.

# అర్ధరాత్రి మానవత్వం చాటిన సోన్ సీఐ

సోన్: మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన ఓ గర్భిణి జిల్లా కేంద్రంలోని మాతాశిశు సంరక్షణ కేంద్రంలో మంగళవారం రాత్రి పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. వైద్యుల సూచనల మేరకు తల్లీబిడ్డను కుటుంబసభ్యులు ఏరియాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు బాబుకు ఆరోగ్య పరీక్షల కోసం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. అర్ధరాత్రి బాలింత వాళ్ల అమ్మ బాబును ఎత్తుకొని ఆటో కోసం రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తోంది. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సోన్ సీఐ నవీన్‌కుమార్ గమనించి ఆమె వివరాలు తెలుసుకున్నారు. తన పోలీస్ వాహనంలో వారిని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. మళ్లీ ఏరియాస్పత్రి వద్ద దింపివేసి మానవత్వం చాటుకున్నారు.



ఏరియాస్పత్రి వద్ద సీఐ నవీన్‌కుమార్

## సంక్షిప్త వార్తలు

**సన్మానం**

లోకేశ్వరం: బదిలీపై వెళ్లిన భూమారావు, రఘువంశీ,శ్రీనివాస్, సాయన్న, విజయ్‌ను మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీ మాజీ చైర్మన్ శ్యాంసుందర్ బుధవారం సన్మానించారు. ఎంపీడీవో సోలమాన్ రాజ్, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ నారాయణ్‌రెడ్డి తదితరులున్నారు.

నిర్మల్‌టౌన్: మున్సిపల్‌లోని పారిశుధ్య విభాగంలో 33 ఏళ్లు విధులు నిర్వర్తించిన బీరెల్లి చిన్న ముత్తన్న ఉద్యోగ విరమణ పొందారు. ఈసందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ ఈశ్వర్.. చిన్న ముత్తన్న దంపతులను సత్కరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవిదాస్, కౌన్సిలర్లు ఉన్నారు.

**పరామర్శ**

సోన్: మండలంలోని న్యూబొప్పారం గ్రామానికి చెందిన సజ్జల నర్సారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకులు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి మల్లారెడ్డి.. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

## రికవరీ చెల్లించాల్సిన గ్రామాలివే

లోకేశ్వరం: 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలోని గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ పనులకు రూ.6కోట్ల10లక్ష70వేల126లను ఖర్చు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ పనులకు 12 రోజులపాటు సామాజిక తనిఖీలు నిర్వహించి మండలంలోని గ్రామాల నుంచి రూ.77,124 రికవరీకి డీఆర్డీవో విజయలక్ష్మి ఆదేశాలు జారీ చేశారు. పుస్పూర్ గ్రామంలో రూ.1,330, కన్కపూర్‌లో రూ.5,867, అబ్దుల్లాపూర్‌లో రూ.2,514, మన్మద్‌లో రూ.2,010, గొడిసెరాలో రూ.5,941, జోహర్‌పూర్‌లో రూ.296, నగర్‌లో రూ.9,869, బాగాపూర్‌లో రూ.686, పంచగుడిలో రూ.1,498, గడ్‌చాందలోరూ.3,901, బామ్నికేలో రూ.9,276, రాజూరలో రూ.12,708, వట్టోలిలో రూ.449, కిష్టాపూర్‌లో రూ.884, లోకేశ్వరంలో రూ.6,492, హవర్గలో రూ.9,875, బిలోలిలో రూ.3,527 చెల్లించాలని పేర్కొన్నారు.

## క్లుప్తంగా

### క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

ముధోల్: రుణమాఫీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని గన్నోర గ్రామంలో రైతులు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ప్రేమ్‌నాథ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు వెంకటి, భోజేందర్‌రెడ్డి, నర్సారెడ్డి, మనోహర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### సాయం అందజేత

ముధోల్: మండల కేంద్రంలోని నయాబాదికి చెందిన మాధవరావు బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు, ఆయనతో పదో తరగతి చదివిన వారు మాధవరావు అంత్యక్రియల కోసం రూ.10వేలను బాధిత కుటుంబానికి సాయంగా అందజేశారు.

### విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు వద్ద రైతు

మామడ: మండలంలోని కమల్‌కోట్ గ్రామంలో గినిమెన లింగన్నకు చెందిన ఎద్దు బుధవారం విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. పంటచేను సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గడ్డి మేస్తుండగా విద్యుత్ సరఫరా అవుతున్న తీగ తగిలి అక్కడికక్కడే చనిపోయింది. ఎద్దు విలువ రూ.60వేల వరకు ఉంటుందని.. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

### విద్యార్థులకు పోషకాహారం అందించండి

కుంటాల: విద్యార్థులకు పోషకాహారం అందించాలని ఎంపీడీవో ఎంఏ రహీం పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఓలా ఉర్దూ, తెలుగు మీడియం ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అనంతరం గ్రామంలో పారిశుధ్య పనులు, నర్సరీని పరిశీలించారు. వన మహోత్సవంలో భాగంగా గ్రామస్తులతో మొక్కలు నాటించాలని ఆదేశించారు. ఏపీవో గట్టుపల్లి నవీన్, హెచ్‌ఎంలు సాజిద్ మిరాజ్, చాట్ల శ్రావణ్‌కుమార్, కార్యదర్శి యోగేశ్ ఉన్నారు.

### యూనిఫాం అందజేత

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో బుధవారం మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం విద్యార్థులకు ప్రభుత్వం నుంచి సరఫరా అయిన యూనిఫాంలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కిషన్, నాయకులు షబ్బీర్‌పాషా, తదితరులు ఉన్నారు.

### చెత్తాచెదారం లేకుండా చూడండి



కార్మికులకు సూచనలిస్తున్న అధికారులు

కుభీర్: మురుగుకాల్వలను శుభ్రం చేసి రోడ్లపై చెత్తాచెదారం లేకుండా చూడాలని డీఎల్‌పీవో సుదర్శన్ పటేల్ పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఉన్న మురుగుకాల్వలను డీఎల్‌పీవో పరిశీలించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లి వాటర్ ట్యాంకులను శుభ్రం చేయాలని పేర్కొన్నారు. ఈవో రాజేశ్వర్, కారోబార్లు బాబు, ప్రకాశ్, పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.

### సెయింట్ థామస్ పాఠశాల విద్యార్థుల ఉదారత

నిర్మల్‌రూరల్: నిర్మల్ మండలంలోని రత్నాపూర్ కాండ్లీ గ్రామానికి చెందిన ముత్తవ్వ అనే వృద్ధురాలు క్యాన్సర్‌తో బాధపడుతూ మందులు కొనలేని స్థితిలో ఉంది. ఈ విషయాన్ని స్వచ్ఛంద సంస్థ ద్వారా తెలుసుకున్న జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ పాఠశాల విద్యార్థులు తమ వంతుగా రూ.10వేలను జమ చేసి వృద్ధురాలికి బుధవారం ఆర్థికసాయంగా అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఫాదర్ సెబాస్టియన్, ఎస్ఎఫ్ మేనేజర్ శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు రాధిక పాల్గొన్నారు.

### విగ్రహం ఏర్పాటుకు వినతి

భైంసాటౌన్: పట్టణంలోని నిర్మల్ చౌరస్తాలో ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటుకు అనుమతించాలని మున్సిపల్ కౌన్సిలర్లు కోరారు. అనుమతి కోరుతూ బుధవారం భైంసా పాలకవర్గం తరపున కలెక్టర్‌కు విన్నవించాలని వైస్‌చైర్మన్‌కు వినతిపత్రం అందించారు. కౌన్సిలర్లు గౌతంపింగ్లే, కపిల్, చందులాల్, దశరథ్, విజయ్, నాయకులు పోశెట్టి ఉన్నారు.

## బురద ఇలా.. వెళ్లేదెలా?



నర్సాపూర్(జి) : ఇటీవలి వర్షాలకు నర్సాపూర్(జి) గ్రామ శివారులోని అటవీశాఖ నర్సరీ, పల్లె ప్రకృతి వనానికి వెళ్లే మట్టి రోడ్డు 200 మీటర్ల మేర అధ్వానంగా మారింది. ఇటువైపు వ్యవసాయ భూములున్న రైతులు, ఎస్సారెస్పీ సుద్దవాగు పరివాహక ప్రాంతంలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు నానావస్థలు పడుతున్నారు. ఈ దారిపై మొరం పోయించి సమస్య పరిష్కరించాలని రైతులు, మత్స్యకారులు వేడుకుంటున్నారు.